క్లుప్తంగా

రైళ్లను పరిశుభ్రంగా ఉంచాలి



కరపత్రాలు అందజేస్తున్న చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

సామర్లకోట: ప్రయాణికులు రైళ్లను పరిశుభ్రంగా ఉంచాలని స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా రైళ్లలో పరిశుభ్రతపై అవగాహన కలిస్తున్నామని చెప్పారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న విశాఖపట్నం వెళ్లే వందేభారత్, మెయిల్, బొకారో ఎక్స్‌ప్రెస్‌ల ప్రయాణికులకు స్వచ్ఛ పఖ్వాడాపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు. బోగీల్లోని టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు కరపత్రాలు అందజేసి, ప్రయాణికులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాట్‌ఫారాలపై ఉన్న విశ్రాంతి భవనాలను శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మకు 'శ్రమ'ర్పయామి..

జాకెట్టు ముక్కలతో గులాబీ పువ్వుల తయారీ



గులాబీ పువ్వులను అమ్మవారికి అలంకరించేందుకు సిద్ధం చేస్తున్న భక్తులు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నూకాలమ్మ అమ్మవారిని ప్రతి ఏడాది ఓ ప్రత్యేక అలంకరణ చేయడం ఆలయ పారాయణ కమిటీ భక్త మహిళల ప్రత్యేకత. ఇందులో భాగంగా మహిళలు జాకెట్టు ముక్కలను నెల రోజుల పాటు కష్టపడి గులాబీ పువ్వులుగా తయారు చేశారు. వివిధ రకాల రంగు జాకెట్టు ముక్కలతో తయారు చేసిన గులాబీ పువ్వులను ఆదివారం నూకాలమ్మ అమ్మవారికి అలంకరణ చేశారు. సోమవారం ఉదయం నుంచి భక్తులకు అలంకరణ చేసిన అమ్మవారి దర్శనానికి అనుమతి ఉంటుందని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. పారాయణ కమిటీ నాయకురాలు సత్తి అరుణ ఆధ్వర్యంలో తయారు చేసిన పువ్వులను పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యులు అమ్మవారికి అలంకరణ ఏర్పాట్లు చేశారు. ఈ అలంకరణ సందర్భంగా ఆలయంలో పారాయణ నిర్వహించారు. వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సౌర యంత్రంతో సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాల యంత్రం

పిఠాపురం: దుర్గాడ శివాలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం దేహ ఆరోగ్యం కోసం ఆలయ ప్రాంగణంలో త్రిచ, సౌర విధానంలో సౌర యంత్రంతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. రుద్రాక్ష ధారిణిగా అమ్మవారిని అలంకరణ చేసి, సౌభాగ్యవతులతో లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

పిఠాపురం: జిల్లా స్థాయిలో చెందుర్తి పాఠశాల విద్యార్థులు రెండు బహుమతులు అందుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి చదువుతున్న కోణాల ఉదయ సాత్విక్‌కు చిత్రలేఖనంలో ద్వితీయ బహుమతి, 8వ తరగతి చదువుతున్న కోణాల అభినవ్‌కు వ్యాసరచనలో ప్రోత్సాహక బహుమతి లభించింది. ఈ నెల 4వ తేదీన వివేకానంద పార్కులోని గ్రంథాలయంలో జరిగిన పోటీల్లో 286 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో బహుమతులను తరగతుల వారీగా ఇవ్వగా, గెలుపొందిన విద్యార్థులకు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో మండలానికి పేరు తెచ్చిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు ఎస్ వెంకటేశ్వరరావు, బి శివప్రసాద్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ సురేష్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

లైబ్రరీ.. స్థలం లేదు సారీ..!

- గ్రంథాలయానికి సొంత భవనం దక్కేనా?
- అద్దె భవనం రెండో అంతస్తులో నిర్వహణ
- మున్సిపల్ స్థల కేటాయింపు కోసం ఎదురుతెన్నులు

సామర్లకోట: గ్రేడ్ 2 మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన సామర్లకోటలో గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. సుమారు 60 వేల జనాభా ఉన్న గ్రంథాలయానికి సొంత భవనం లేదని తెలిసి పొరుగు ప్రాంతాల వారు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న పోటీ యుగంలో గ్రంథాలయ ప్రాధాన్యం పెరిగింది. 1956లో సామర్లకోట సమితి స్థాయి నుంచి మున్సిపాలిటీగా గుర్తింపు వచ్చింది. అప్పట్లో మున్సిపల్ కార్యాలయంలో బాపూజీ పేరుతో గ్రంథాలయం ఉండేది. అయితే ఆ గ్రంథాలయం నిర్వహణ మున్సిపాలిటీకి భారంగా ఉండటంతో మూసివేశారు.మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం అద్దె భవనంలోనే మగ్గుతోంది. ఈ గ్రంథాలయాన్ని అనేక అద్దె భవనాలలోనికి మార్పు చేస్తూ వచ్చారు.

పిండి కొద్దీ రొట్టె సామెతగా..

ప్రభుత్వం ఇచ్చే అద్దెకు పిండి కొద్దీ రొట్టె సామెతగా షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్తులో ప్రస్తుతం గ్రంథాలయం నిర్వహణ సాగుతోంది. సుమారు గత 15 ఏళ్లుగా రెండో అంతస్తులోని అద్దె భవనంలో గ్రంథాలయ నిర్వహణతో పాఠకులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. రెండో అంతస్తులో ఉన్న గ్రంథాలయానికి 40 మెట్లు ఎక్కవలసి ఉంది. వృద్ధులు, దివ్యాంగులను గ్రంథాలయానికి దూరం చేస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. యువకులే గ్రంథాలయానికి చేరుకునే సమయానికి అలసటకు గురవుతున్నారు.

స్థలం కేటాయిస్తే..

మున్సిపాలిటీ స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. కాపు కల్యాణ మండపం సమీపంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక స్థలం గ్రంథాలయానికి కేటాయిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందనే వాదనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అదే విధంగా సత్య థియేటర్‌కు వెళ్లే మార్గంలో తిలక్ చౌక్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న స్థలమైనా కేటాయించాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు.



అద్దె భవనంలో రెండో అంతస్తులో ఉన్న సామర్లకోట గ్రంథాలయం

స్థలం కోసం పోరాటం



గ్రంథాలయానికి మున్సిపాలిటీ స్థలం కేటాయించాలని గత 10 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. గ్రంథాలయ వారోత్సవాలు వచ్చిన ప్రతి ఏడాది పాలక మండలి సభ్యులు స్థలం కేటాయిస్తామని హామీ ఇస్తున్నారు. అమలు జరగడం లేదు. విద్యార్థులు, వృద్ధులకు ఉపయోగపడే గ్రంథాలయాన్ని అందుబాటులో ఉంచవలసిన బాధ్యత మున్సిపాలిటీపై ఉంది. గతంలో ఎలిమెంటరీ పాఠశాల నిర్వహించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంగా గ్రంథాలయానికి అనువుగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది



గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని గతంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్‌కు లైబ్రరీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆర్జీ అందజేశాం. నూతనంగా వచ్చిన కమిషనర్ ద్వారా ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులకు స్థలం సమస్య తెలియజేసే విధంగా సోమవారం దరఖాస్తు అందజేస్తాం. వృద్ధులు, దివ్యాంగులు రెండో అంతస్తులో ఉన్న గ్రంథాలయానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

– బందిల రత్నమణి, గ్రంథాలయ అధికారి, సామర్లకోట

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

పిఠాపురం: పిఠాపురం క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2,011 ఓట్లకు 981 ఓట్లు పోలవ్వగా, 48 శాతం పోలింగ్ నమోదైంది. బాలిపల్లి రాంబాబు, యెల్లుబోయిన ప్రమీల, అద్దంకి వెంకటరమణ, అరిగెల ప్రసాదరావు, మేళం రామకృష్ణ సభ్యులుగా గెలుపొందారు. గెలుపొందిన సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సామర్లకోట: మోటార్ బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో మాధవపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మాధవపట్నానికి చెందిన చింతపల్లి రాజు, గుతుత్తి సురేష్ సెల్‌ఫోన్ కొనుగోలు కోసం మోటార్ బైక్‌పై ఆదివారం పెద్దాపురం వెళ్లారు. సెల్‌ఫోన్ కొనుక్కొని తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. కాకినాడ నుంచి సామర్లకోట వస్తున్న కారు వీరి మోటార్ బైక్‌ను ఐదు తూముల వద్ద ఢీకొంది. ఈ ఘటనలో మోటార్ బైక్ నుంచి కిందపడిన వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్సై మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

- తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- తలుపు ధ్వంసం చేసి ప్రవేశించిన దొంగలు

సామర్లకోట: గత కొన్నేళ్లుగా స్థానిక సత్యనారాయణపురంలో దొంగతనాలు పెరిగిపోయాయి. ఆదివారం తెల్లవారుజామున సత్యనారాయణపురంలోని ఒక ఇంట్లో దొంగలు తలుపు, తాళాలు పగులగొట్టి, ఇంటిలోకి చొరబడ్డారు. ఆ ఇంట్లో నివసిస్తున్న సత్తిబాబు, వెంకటలక్ష్మి దంపతులు ఇటీవల హైదరాబాద్‌లో ఉంటున్న తమ రెండో కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంటి వాకిలి శుభ్రం చేయడానికి వచ్చిన పని మనిషి గుమ్మం వద్ద తలుపు పొట్టు ఉండటంతో, అనుమానం వచ్చి తలుపు కర్టెన్ తొలగించి చూడగా తాళం పగులగొట్టి ఉన్నట్లు గమనించింది. వెంటనే సమీపంలో వారికి విషయం తెలియజేయడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటిలోకి వెళ్లిన దొంగలు.. బయటకు వచ్చిన సమయంలో తెలుపు గెడ పెట్టి, కర్టెన్ వేసి, గోడ దూకి పరారయ్యారు. ఈ మేరకు సమీపంలోని గోడపై దొంగల కాలిముద్రలు ఉన్నాయి. ఇంట్లో రెండు రూములు ఉండగా, ఒక దాని తాళం తెరిచి, చేతికందిన వస్తువులు తీసుకుపోయారు. రెండో గది, దేవుడు గది తాళాలను వారు ముట్టుకోలేదు.



చిందరవందర చేసిన ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు

విషయం తెలుసుకున్న సత్తిబాబు పెద్ద కుమారుడు వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో విలువైన వస్తువులేమీ చోరీ కాలేదని నిర్ధారించాడు. చుట్టూ ఇళ్లు ఉండగా,, పైభాగంలో రెండు కుటుంబాల వారు నివసిస్తున్నారు. అయినా దొంగలు తలుపులు చెక్కి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడడంతో ఆ ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

నాలుగు చోరీలు

ఏడాది కాలంలోనే ఆ ప్రాంతంలో నాలుగు చోరీలు జరిగినా, ఇప్పటి వరకు ఎటువంటి రికవరీలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం చోరీ జరిగిన ఇంట్లో మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న వారి ఇంట్లోను, ఆ ఇంటి సమీపంలో ఉన్న మరో ఇంటిలోను వరుసగా చోరీలు జరిగాయి. ఇటీవల శ్రీరామనమి వేడుకలను తిలకించడానికి వెళ్లేందుకు ఓ మహిళ సిద్ధమవుతుండగా, ఆగంతకుడు ఇంటిలోకి చొరబడి పట్టపగలు మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించాడు.



గోడపై దొంగ పాద ముద్ర

దొంగలకు అవకాశం

సత్యనారాయణపురం ఏడీబీ రోడ్డుకు, రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉండటంతో దొంగలు సులభంగా తప్పించుకొవడానికి అవకాశం ఉంటుంది. ఏడీబీ రోడ్డు పరిశ్రమలలో పని చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఆ ప్రాంతం లో నివసిస్తున్నారు. దాంతో ఎవరెలాంటి వారో తెలుసుకోవడం కష్టంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచి, నేరాలు అదుపు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల వేట్లపాలెంలో ఉపాధ్యాయుడి తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగిన విషయం తెలిసిందే. సామర్లకోట జంక్షన్ కావడంతో పోలీసుల సంఖ్య పెంచవలసి ఉండగా, అందుబాటులో ఉన్న పోలీసులను బందోబస్తు పేరుతో ఇతర ప్రాంతాలకు పంపడం సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి.



దొంగలు ధ్వంసం చేసిన తలుపు

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ

సత్యనారాయణ పురంలో చోరీ జరిగిన ఇంటిని సీఐ ఎ కృష్ణభగవాన్ ఆదివారం రాత్రి పరిశీలించారు. తెల్లవారుజామున సత్తిబాబు ఇంట్లో చోరీ జరిగింది. ఆ ఇంటిని పరిశీలించి, ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారి నుంచి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఊరు వెళ్లే సమయంలో ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చోరీ జరిగిన తరువాత ఏ వస్తువునూ తాకకూడదని, దొంగల వేలిముద్రలు ఉంటాయని చెప్పారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు



గాయత్రీదేవిగా పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి



ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు



కూష్మాండ అవతారంలో తాటిపర్తి అపర్ణాదేవి



గాజుల అలంకారంలో రాపర్తి దుర్గామల్లేశ్వరి అమ్మవారు



రుద్రాక్షల అలంకారంలో దుర్గాడలో లలితా మాత



శాకంబరిగా కొమరగిరి దుర్గాదేవి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కొత్తపల్లి దుర్గాదేవి



సామర్లకోటలోని నూకాలమ్మ అమ్మవారు



లలితా త్రిపుర సుందరి అవతారంలో కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పిఠాపురం: శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణలో పదో శక్తి పీఠం పురుహూతికా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సంధర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు నాలుగో రోజు కూష్మాండ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. డ్రైఫ్రూట్స్‌తో అమ్మవారిని అలంకరించారు. దుర్గాడ శివాలయంలో లలితా మాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం మండలం రాపర్తిలో ఉన్న దుర్గామల్లేశ్వరి అమ్మవారిని గాజులతో అలంకరించారు.

నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

సామర్లకోట: మండలంలోని పి వేమవరం గ్రామంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ శిబిరం వద్ద ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాకారులు గరగ నృత్యాలు చేశారు.

నూకాలమ్మ అమ్మవారికి విశేషాలంకరణ

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారిని జాకెట్టు ముక్కలతో తయారు చేసిన గులాబీ పూలతో ఆదివారం సాయంత్రం అలంకరించారు. ఈ అమ్మవారి అలంకరణను సోమవారం నుంచి భక్తులు తిలకించే విధంగా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు అలంకరణ ఉంటుందన్నారు. పారాయణ కమిటీ అధ్యక్షరాలు సత్తి అరుణ ఆధ్వర్యంలో జాకెట్టు ముక్కలతో తయారు చేసిన పూలను పంచారామ క్షేత్ర దీపారాధన సంఘ సభ్యులు అలంకరణ చేశారు.



భువనేశ్వరి పీఠంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

లలితా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు

పెద్దాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక వర్షుల వారి వీధిలో ఉన్న శ్రీభువనేశ్వరి పీఠంలో ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పీఠంలో మండప ఆరాధన, అమ్మవారికి, అయ్యవారికి అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీలలితా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారిని అలంకరించారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు సౌజన్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను అన్నపూర్ణదేవి అవతారంలో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.



పి.వేమవరంలో దేవీ నవరాత్ర ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజప్ప



పెద్దాపురంలో మరిడమ్మ అమ్మవారు



భువనేశ్వరి అమ్మవారు